క్లుప్తంగా

నమ్మించి మోసగించడంలో చంద్రబాబు దిట్ట



బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: ప్రజలను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గడపగడపకీ వెళ్లి చంద్రబాబు మోసాల గురించి ఆమె బూత్–43 పరిధిలో ఉన్న కొబ్బరితోట ఎగువ వీధి ప్రాంతంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండా రమణ, చౌల్ట్రీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీను, 43వ బూత్ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు, సభ్యులు దానాయమ్మ, జానకమ్మ, లక్ష్మణ్ (వైట్), వార్డు మహిళా నాయకులు గాలి పార్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియం సందర్శన



విశాఖ మ్యూజియం వద్ద కళాశాల విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు మంగళవారం విశాఖ మ్యూజియంను సందర్శించారు. చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్ర విభాగం విద్యార్థుల్లో చారిత్రక జ్ఞానం, సంస్కృతిక వారసత్వం పట్ల అవగాహన పెంపొందించేందుకు మ్యూజియంను సందర్శించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. 98 మంది విద్యార్థినులు 4 బృందాలుగా పాల్గొన్నారు. మ్యూజియంలో భారతదేశ చారిత్రక వారసత్వానికి సంబంధించి పలు పురాతన వస్తువులు, నౌకాదళ సామగ్రి, గడియారాలు, పురాతన కరెన్సీ వంటివి విద్యార్థులు వీక్షించారు. ఇలాంటి అభ్యసన పర్యటనలు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.గీతాంజలి, ఎస్.రాజేష్, డాక్టర్ బి.నాగమణి, జి.జ్యోతి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీలక్ష్మి పూజలు 13వ రోజుకు చేరాయి. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

సిరులతల్లికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు

సీతంపేట : శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 9న అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం 7 గంటలకు కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ, ఉదయం 9 గంటలకు మణిద్వీపంలో శ్రీచక్ర నవావరణ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు హయగ్రీవ జయంతి సందర్భంగా హయగ్రీవులకు విశేష అభిషేకం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మార్కెట్లకు శ్రావణ శోభ

- వరలక్ష్మీ వ్రతానికి జోరుగా అమ్మకాలు
- పూజా సామగ్రి కొనుగోళ్లలో మహిళలు బిజీ
- ఆకాశాన్ని అంటుతున్న ధరలు



పండుపుల్లల సందులో కొనుగోలుదారుల రద్దీ

డాబాగార్డెన్స్: శ్రావణ మాసం.. అందులోనూ మూడో శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నోచుకునేది ఈ రోజే. ఈ నేపథ్యంలో ముందుగానే నియోజకవర్గ పరిధి మార్కెట్లకు వరలక్ష్మీ వ్రతం తాకిడి పెరిగింది. పూజా సామగ్రి, వస్త్రాలు, బంగారం కొనుగోళ్లకు మహిళలు పోటెత్తుతున్నారు. ప్రధాన మార్కెట్లు, కూరగాయల బజార్లు, బంగారం, వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా డిమాండ్‌ను సొమ్ము చేసుకోవాలన్న లక్ష్యంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. తోరణాలుగా కట్టే మామిడి కొమ్మల నుంచి పూలు.. పండ్లు.. పూజా సామగ్రి వరకు మంగళవారం నుంచే అధిక ధరలకు విక్రయించడం మొదలెట్టారు.

మార్కెట్లు కిటకిట..

శ్రావణమాసం మూడో శుక్రవారం (వరలక్ష్మీ వ్రతం) కావడంతో బట్టల దుకాణాలు ఊపందుకున్నాయి. వస్త్ర వ్యాపారులు దేశంలోని పలు నగరాలు, పట్టణాల నుంచి లేటెస్ట్ వెరైటీలు అందుబాటులో ఉంచడం.. పండగ సందర్భంగా ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతో షోరూమ్‌లు కళకళలాడుతున్నాయి. జగదాంబ జంక్షన్, కురుపాం మార్కెట్‌లోని బంగారం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. వరలక్ష్మి వ్రతానికి ముఖ్యమని మహిళలు భావించే లక్ష్మీ కాసులు, జాతి రాళ్ల ఆభరణాలు, పచ్చలు, కెంపులు అతివలను ఆకట్టుకునే రీతిలో అందుబాటులోకి తేవడంతో ఆయా దుకాణాల్లో సందడి నెలకొంది. వరలక్ష్మి వ్రతం రోజు కొంత బంగారమైనా ధరించాలన్న నమ్మకంతో యువతులు, మహిళలు బంగారం దుకాణాలకు క్యూ కట్టారు. ఇవే కాక ఫుట్‌వేర్, ఫర్నిచర్ దుకాణాలు పండగ సందడితో నిండుగా కనిపిస్తున్నాయి.

పోటెత్తిన పండుంపుల్లల సందు..

వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూర్ణామార్కెట్ పండుంపుల్లల సందు కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. అమ్మవారికి కొత్త చీర, జాకెట్టు కొనుగోలు చేసేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో మార్కెట్ పరిసర ప్రాంతాలన్నీ మహిళలతో కిటకిటలాడుతున్నాయి.

పుంజుకున్న మార్కెట్లు..

పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, అల్లిపురం బజార్, చెంగల్రావుపేట మార్కెట్‌కు వరలక్ష్మీ వ్రతం తాకిడి మొదలైంది. ఆషాఢ మాసంలో బోసిపోయిన వ్యాపారాలు శ్రావణ మాసంలో ఊపందుకున్నాయి. వరలక్ష్మి వ్రతం పూజకు అవసరమైన సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి.

పూజా సామగ్రి ధరలిలా..

కొబ్బరికాయ పెద్దది	: 40	కలువ పువ్వు ఒకటి	: 20
ద్రాక్ష పావుకేజీ (నల్లవి)	: 50	బత్తాయి పండు ఒకటి	: 10
జామ పండు ఒకటి	: 20	దానిమ్మ పళ్లు (3)	: 100
250 గ్రాముల చామంతి	: 70	యాపిల్ పండు ఒకటి	: 25
గులాబి పువ్వులు (డజను)	: 50	అరటి పండ్లు డజన్	: 80
		మామిడాకులు	: 10
		గాజులు డజను (ఎర్రవి)	: 50



తాంబూలం ఇచ్చే రెడీమేడ్ ప్లేట్లు



వరలక్ష్మీ వ్రతం సామగ్రి కొనుగోళ్లకు పూర్ణామార్కెట్‌కు పెద్ద సంఖ్యలో విచ్చేసిన మహిళలు

ధరలు పెరిగిపోతున్నాయి..



శ్రావణమాసం వచ్చిందంటే చాలు ఒక వైపు పండగలు, మరొక వైపు పెళ్లిళ్లు. దీంతో పువ్వులు, పండ్ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. మూడో శుక్రవారం మరీ ఎక్కువగా ఉంటున్నాయి. 5 రకాల పండ్లు, 5 రకాల పువ్వులు, 5 రకాల పిండివంటలు, చీర, జాకెట్టు, లక్ష్మీరూపుతో పూజ చేస్తే సుమారు ఏడెనిమిది వేలు ఖర్చు అవుతోంది. ఇలా ధరలు పెరుగుతూ పోతే సామాన్యుల పరిస్థితి ఏమిటి.

– సీహెచ్ రాజేశ్వరి, దిబ్బలపాలెం

ఏం కొనగలం..



పువ్వులు కొనాలంటే భయమేస్తోంది. పూజా సామగ్రి కూడా కొనలేని పరిస్థితి. ప్రతి ఏడాది ఇదే విధంగా ధరలు పెరిగిపోతున్నాయి. తప్పనిసరి పరిస్థితిలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరలు పెరిగినా వ్రతం చేసుకోక మానం కదా. ఈ ఏడాది మూడో శుక్రవారం అమ్మవారి వ్రతం చేసుకోవాలి కనుక ఈ వారం ధరలు ఇప్పటి నుంచే భారీ పెరిగిపోయాయి. ఏం కొనాలన్నా భయమేస్తోంది.

– జి.రమాదేవి, మహారాణిపేట

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటాం

టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు



స్థానికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: ఈ నెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అయ్యో రామా.. ఇదేం ఖర్మ!' కథనానికి టూటౌన్ పోలీసులు స్పందించారు. మంగళవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు చర్యలు తీసుకుంటామని సాక్షికి తెలిపారు. ప్రతి రోజు బీట్ కానిస్టేబుళ్లతో ఈ ప్రాంతంలో తనిఖీలు చేపడతామన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

గీతాభవన్‌లో సంపూర్ణ గీతా పారాయణం



పూజలందుకుంటున్న గీతాచార్యుడు

డాబాగార్డెన్స్: పాత నగరంలోని రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీగీతా భవనంలో శ్రావణమాసం ఏకాదశిని పురస్కరించుకుని సంపూర్ణ గీతా పారాయణం జరిగింది. మంగళవారం గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో 701 శ్లోకాలను మహిళలు అనర్గళంగా పారాయణ చేశారు. అనంతరం గీతాచార్యునికి ధూప, దీప నైవేద్య, మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, గీతా ప్రచార సమితి కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, మహిళా సభ్యులు జి.లక్ష్మీనరసింహ, లలిత, రేవతి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మహారాణిపేట: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి క్యాబినెట్ సబ్ కమిటీ కృషి చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు మంగళవారం జర్నలిస్టుల కోర్కెల దినాన్ని విశాఖ జిల్లా జర్నలిస్టులు పాటించారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి సమస్యలు వివరించారు. అనంతరం విశాఖ జిల్లాకు విచ్చేసిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ప్రధానంగా కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వకపోవడం వల్ల చాలా మంది జర్నలిస్టులు నష్టపోతున్నారని వివరించారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులను కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు గుర్తించకపోవడం వల్ల పూర్తిస్థాయి న్యాయం జరగడంలేదని పేర్కొన్నారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో మేరకు జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, డి. హరినాథ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చందు యాదవ్, గోగుల శ్రీనివాసరావు, సుధ, భరత్, మనభూమి సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక అధ్యక్షుడు పరశురాం, జిల్లా కార్యవర్గ సభ్యులు రామనాయుడు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

4 వేల మంది పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ డాక్టర్ బాగ్చి, డాక్టర్ వాణి తదితరులు



మహిళా కానిస్టేబుల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సుమారు 4 వేల మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు 'వార్షిక పోలీసు ఆరోగ్య పరీక్ష 2.0' కార్యక్రమం మంగళవారం కేజీహెచ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ప్రతి రోజూ సుమారు 120 నుండి 150 మంది పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించనున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణరావు, కేజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణన్, డాక్టర్ యు. శ్రీహరి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1, గ్రేడ్–2 పాల్గొన్నారు.

ప్రేమసమాజం సేవలు మహోన్నతం



కార్యక్రమంలో పాల్గొన్న కుష్టువ్యాధిగ్రస్తులు

అల్లిపురం: ప్రేమ సమాజం కుష్టు శరణాలయ 71వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ ఎస్.ఎస్.రాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం చేపడుతున్న సేవలన్నింటి కంటే కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి వారికి సేవలందించడం అన్నింటికంటే మహోన్నతమైనదని తెలిపారు. సభాధ్యక్షుడు కేశప్రగడ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మంది రోగులను అక్కున చేర్చుకుని వారికి ఆశ్రయం కల్పిస్తూ, సపర్యలు చేస్తుందన్నారు. 1956లో చెవిడి రాణి ప్రేమసమాజం చేస్తున్న సేవలను గుర్తించి ఏవీఎన్ కళాశాల దరి స్థలాన్ని ఉచితంగా అందించారని తెలిపారు. 200 మంది రోగులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు పది మంది మాత్రమే మిగిలారన్నారు. మిగిలివాన వారు ప్రేమసమాజం సేవల వల్ల కోలుకుని ఇళ్లకు వెళ్లిపోవడం గర్వకారణం అన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి అతిథులు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి. మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి పి.లక్ష్మీగుప్తా, లంకాడ వెంకట్రావు, చోడవరం శాఖ కార్యదర్శి సరగడం సత్యనారాయణ, ఆశ్రమవాసులు, బాలబాలికలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.సుధీర్ మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయని, ప్రతి సచివాలయం పరిధిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వివరించాలన్నారు. మలేరియా సూపర్‌వైజర్ గొర్లె లక్ష్మణ్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా క్షేత్ర స్థాయిలో ఫ్రైడే డ్రైడే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఏఎన్ఎంలు, ఆశాలు అవగాహన కల్పించాలని కోరారు. రేసపువానిపాలెంలో గల స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి మలేరియా, డెంగ్యూ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో కార్యాలయ సిబ్బంది కోట్ని శ్రీనివాసు, ల్యాబ్ టెక్నీషియన్ పి.కామరాజు, ఏఎన్ఎంలు కరుణ కుమారి, రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, రాణి, వెంకటలక్ష్మి, కమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు



సముద్రపు నాచు ఉత్పత్తుల గురించి మత్స్యకారులకు వివరిస్తున్న అధికారులు

మహారాణిపేట: సముద్రపు నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. బీచ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ (సిఫ్ నెట్) కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. నాచు పెంపకానికి అనువైన ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. సముద్రపు నాచులో అనేక రకాలు ఉన్నాయని, ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలో నాచు పెంపకం, సముద్రపు నాచు ఎండబెట్టడం వంటి వాటిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. దీనిపై మత్స్యకార యువతకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. సీఎఫ్‌నెట్ ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సముద్రపు నాచుతో తయారు చేసే పలు ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, డిప్యూటీ డైరెక్టర్ హెచ్.బిషోయ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రెనింగ్ (ఎన్ఐఎఫ్‌పీహెచ్ఏటీటీ) డి.డి. డాక్టర్ మీనా కోటేశ్వరరావు, డాక్టర్ రమ్య, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీవో ఆషాజ్యోతి, డీసీఎం కృష్ణ, గరికిన రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

అల్లిపురం: శ్రావణ మాసం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల మహిళలు మంగళ గౌరీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకటేశ్వర మెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయం ఆవరణలో జరిగిన మంగళ గౌరీ వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

విజయవంతంగా ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి



శిక్షణలో పాల్గొన్న వారితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: త్వరలో జరగనున్న నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) కోసం హౌస్ హోల్డ్ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, అంకాలజీ యూనిట్ నోడల్ అధికారులు డాక్టర్ కె.సాయి సుష్మ, డాక్టర్ పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో కొనసాగుతున్న సదరం క్యాంప్



విమ్స్‌లో సదరం క్యాంప్‌నకు హాజరైన దివ్యాంగులు

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించే సదరం క్యాంప్ కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన క్యాంప్‌లో 30 మందికి ఆర్థోపెడిక్ వైద్యులు పరీక్షలు జరిపారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పర్యవేక్షణలో ఈ క్యాంప్ ఇక్కడ నాలుగు వారాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతీ మంగళవారం సదరం క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సుమారు 120 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించినట్లు డైరెక్టర్ రాంబాబు తెలిపారు. విమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో దివ్యాంగులకు మాత్రమే సదరం క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

'ఎంవీవీ' స్మారక పురస్కారాల ప్రదానం



రచయిత మంజరిని సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, రమణమూర్తి తదితరులు

సీతంపేట: రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎం.వి.వి.సత్యనారాయణ స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రముఖ కథా రచయిత మంజరి (గంధం నాగేశ్వరరావు), ప్రముఖ విద్యా వేత్త డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తికి స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్ అధికారిగా ఉద్యోగం చేస్తూ తన విధుల్లో ఎదురైన సంఘటనలను కథలుగా మలిచి పాఠకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించిన రచయిత మంజరిని స్మారక పురస్కారానికి ఎంపిక చేసిన ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే విద్యావేత్త, సామాజిక వేత్త, ఎందరికో ఉచితంగా విద్యను అందించిన కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తికి స్మారక పురస్కారం అందజేయడం ప్రశంసనీయమన్నారు. పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలన్నారు. పిల్లలను కథల వైపు మళ్లించాలని సూచించారు. యువతలో రచయితలు అరుదుగా కన్పిస్తున్నారని, రచయితలను ప్రోత్సహించేలా ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలన్నారు. కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ రచయిత సమాజానికి మార్గదర్శి అని, పాఠకులను ప్రభావితం చేసేలా రచనలు ఉండాలన్నారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ఎంవీవీ నాస్తికులని, జై ఇన్సాన్ అన్నది వారి నినాదమన్నారు. సత్యాన్వేషణలో మానవత్వం ముఖ్యమన్నారు. అనంతరం పురస్కారాల గ్రహీతలను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంవీవీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అతనితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో డ్రైవర్లకు నష్టం

సీతంపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురి చేస్తోందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరలు, విడిభాగాల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో రోజంతా ఆటో నడిపినా పూట గడవడం కష్టంగా ఉందన్నారు. దీనికితోడు ఉబర్, ఓలా, రాపిడోతో ఉపాధి కోల్పోతున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంపై పునరాలోచన చెయ్యాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావికృష్ణ, దేవుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.